యాజమాన్యంతో రక్ష

- అధిక ఉష్ణోగ్రతలతో ఎండుతున్న ఆయిల్ పామ్ చెట్ల ఆకులు
- పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం
- రైతులు యాజమాన్యంపై దృష్టి పెట్టాలి
- కృష్ణా జిల్లా ఉద్యానశాఖ అధికారి జ్యోతి



ఈడుపుగల్లు ఆయిల్ పామ్ తోటలో ఎండుముఖం పట్టిన ఆకులు

కంకిపాడు: మనుషులకే కాదు చెట్లకు కూడా వడ దెబ్బ తగులుతుంది. అధిక ఉష్ణోగ్రతల సమయంలో ఆవిరి పీడన వ్యత్యాసం ఇందుకు కారణం అవుతోంది. ప్రధానంగా ఆయిల్‌పామ్ తోటల్లో మొవ్వ ఆకులు వడిలిపోయి మెలి తిరుగుతాయి. చెట్ల ఆకులు ఇలా మెలితిరిగితే పంట దిగుబడులపై ప్రభావం తీవ్రంగా ఉంటుంది. సకాలంలో యాజమాన్య చర్యలు తీసుకోవటం ద్వారా చెట్లను రక్షించి పంట దిగుబడులను కాపాడుకోవచ్చని కృష్ణా జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి సూచిస్తున్నారు.

5193.57 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు

ఉద్యాన పంటల్లో ఆయిల్‌పామ్ తోటలను వ్యాపార పరంగా సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 5,193.57 హెక్టార్లలో ఈ పంట సాగవుతోంది. ప్రధానంగా బాపులపాడు మండలంలో 4,497 హెక్టార్లలో ఆయిల్ పామ్‌ను రైతులు సాగు చేస్తున్నారు. గన్నవరం, కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు, ఉంగుటూరు వంటి మండలాల్లోనూ ఆయిల్ పామ్ తోటలు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం ఆయిల్‌పామ్ తోటల్లో మొవ్వ భాగంలో ఆకులు వడలి కిందకు వేలాడటం, మెలితిరగటం వంటి లక్షణాలను రైతులు గుర్తించారు. వేసవి సీజన్‌లో ఈ లక్షణం అధికంగా కనిపిస్తోంది. జిల్లాలో బాపులపాడు సహా పలు ప్రాంతాల్లో ఈ సమస్య ఉంది. ఏలూరు సమీపంలోని విజయరాయి హార్టీకల్చర్ రీసెర్చ్ స్టేషన్ నుంచి శాస్త్రవేత్త తిరుపతిరెడ్డి ఇటీవల ఉద్యానశాఖ అధికారులతో కలిసి జిల్లాలోని ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి పంట సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించారు.

- ఆయిల్ పామ్ తోటల్లో ఆవిరి పీడన వ్యత్యాసం వల్ల చెట్లకు ఒక రకంగా వడదెబ్బ తగిలినట్టే. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు ఈ పరిస్థితి ఏర్పడుతుంది.
- అధిక ఉష్ణోగ్రతల వల్ల సాధారణంగా ఆకుల్లో ఉన్న పత్ర రంధ్రాలు మూసుకుపోయి నీటిని బయటకు పోనివ్వవు.
- అధిక ఉష్ణోగ్రతలు ఎక్కువ కాలం ఉండి పత్ర రంధ్రాలు తెరుచుకోకపోతే చెట్టులో అంతర్గతంగా కార్బన్‌డయాక్సైడ్, ఆక్సిజన్ మార్పిడి జరగక చెట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది.
- ఎరువులు వేసినా తీసుకునే పరిస్థితి ఉండదు. పట్టుకోల్పోయి మొవ్వ ఆకులు వడలి వేలాడి, మెలితిరుగుతాయి.
- ఈ సమస్యను అధిగమించటానికి వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న సమయంలో చెట్లకు నీరు అధికంగా ఇవ్వాలి.
- గాలిలో ఉన్న తేమతో తోటల్లోని మైక్రోక్లైమేట్‌లో తేమ పెరుగుతుంది. గాలిలో తేమ అధికంగా ఉండే ఆకుల పత్ర రంధ్రాల ద్వారా తమలో దాచిన నీటిని/తేమను చెమటలాగా బయటకు విడిచిపెడతాయి.
- తద్వారా చెట్టుకు సమృద్ధిగా గాలి, నీరు, పోషకాలు అందుతాయి. దీని వల్ల చెట్టు ఎదుగుదల బావుంటుంది. దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి.
- రైతులు పొటాష్, యూరియా వంటి ఎరువులు విడిగా గానీ, డ్రిప్ ద్వారా గానీ అందించాలి.
- ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకోవటానికి పొటాష్ వినియోగం ఉత్తమ మార్గం.
- చెట్ల పాదులను శుభ్రం చేసుకోవాలి. గెలల పీచు, రాలిన మట్టలను చిన్న ముక్కలుగా నరికి వాటిని పాదుల్లో వేసి కప్పితే నేలలోని తేమ ఆరిపోకుండా ఉంటుంది.
- పరిస్థితి తీవ్రమై చెట్ల మొవ్వులోని ఆకులు వడలిపోయి, రాలిపోయే స్థితిలో ఉంటే అవసరాన్ని బట్టి ఒకటి, రెండు ఆకులను తీసివేసి, మొవ్వ బరువు తగ్గించవచ్చు.
- గెలల కింద ఉన్న మట్టలను మాత్రం తొలగించకూడదు.
- అంతర పంటగా కోకోను సాగు చేసుకోవటం ద్వారా కూడా ఆయిల్ పామ్ తోటలను సంరక్షించుకోవచ్చు.
- కోకో పంట సాగు ద్వారా రాలిపోయిన కోకో ఆకులు ద్వారా నత్రజని భూమికి సమృద్ధిగా అందుతుంది. భూసారం పెరుగుతుంది.
- అంతరపంటగా సాగు చేయటం ద్వారా రైతులకు ఎకరాకు సంవత్సరానికి రూ.25 వేల వరకూ అదనపు ఆదాయం వస్తుంది.

యాజమాన్యం తప్పనిసరి



ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఆయిల్ పామ్ చెట్ల ఆకులు వాలిపోయినట్లు గుర్తిస్తే యాజమాన్యంపై రైతులు దృష్టిసారించాలి. శాస్త్రవేత్తల ద్వారా రైతులకు అవగాహన కల్పించాం. సూచనలు పాటించి యాజమాన్య చర్యలు తీసుకోవాలి. అంతర పంటగా కోకో సాగు చేసేందుకు ముందుకు రావాలి. అంతర పంటతో ఆదాయం వృద్ధి అవుతుంది. చాక్లెట్స్ తయారీ కంపెనీలు రైతుల వద్దకు వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నాయి. రైతులు అవగాహనతో కూడిన సాగు ద్వారా లాభాలు ఆర్జించవచ్చు.

– జె.జ్యోతి,
కృష్ణా జిల్లా ఉద్యానశాఖ అధికారి

క్లుప్తంగా

వైభవంగా శీతలాదేవి ప్రతిష్ఠా మహోత్సవం



కంకిపాడు: కంకిపాడు పట్టణంలో శీతలాదేవి(బొడ్డురాయి) ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. పట్టణంలోని వాటర్‌ట్యాంకు ప్రాంతంలో శీతలాదేవిని శాస్త్రోక్తంగా, ప్రత్యేక పూజల నడుమ ప్రతిష్ఠింపజేశారు. పూజా కార్యక్రమాలకు రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. నిర్వాహక ప్రతినిధులు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద పంపిణీని ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, ఎంపీటీసీలు కోనా కృష్ణకిషోర్, చిట్టూరి ప్రసాద్, సర్పంచ్ బాకీ రమణ, సగర, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్లు నక్కా శ్రీనివాసరావు, రామినేని రమాదేవి, సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల పూడికతీత



పెనమలూరు: డ్రెయినేజీల పూడికతీతకు చర్యలు తీసుకుంటున్నట్లు తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. యనమలకుదురు గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. యనమలకుదురు సర్కిల్ 2వ సచివాలయం పరిధి సంజీవయ్యనగర్‌లో డ్రెయినేజీలపై అందిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోవటానికి పర్యటించారు. మురుగు కాలువలు, డ్రెయినేజీలు పూడుకు పోవటంతో మున్సిపాలిటీ కార్మికులతో పూడిక తీయించారు.

సెల్ ఫోన్ వినియోగంతో జ్ఞాపకశక్తి మందగిస్తుంది

నున్న(విజయవాడరూరల్): సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగించడంతో జ్ఞాపకశక్తి మందగిస్తుందని కెరీర్ కౌన్సిలర్ తుమ్మల దీప్తి అన్నారు. నున్న వికాస్ కాలేజీలో సోమవారం పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెల్ ఫోన్లు వాడటం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ గోపాల్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషోర్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ బలగాలతో కవాతు



రామవరప్పాడు: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పీఎస్ఆర్ కాలనీ, దూపాళ్ల కట్ట, ప్రసాదంపాడు గ్రామాల్లో సోమవారం పటమట పోలీస్‌స్టేషన్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ కాంతి రానా టాటా ఆదేశాల మేరకు పటమట సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం ఈ కవాతు చేపట్టారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన పరుస్తూ, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మేమున్నామన్న భరోసా ప్రజలకు కల్పిస్తూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

ఆనందోత్సాహాలతో హోలీ



పెనమలూరు: మండల పరిధిలో హోలీ పండుగ వేడుకలు ఘనంగా జరిపారు. పోరంకి సుగాలీ కాలనీలో స్థానికులు హోలీ పండుగ చేయగా రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జోగి రమేష్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు హోలీ పండుగను ఆనందంగా గడుపుకోవాలన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీర్లు అనాథ పిల్లలతో కలిసి హోలీ పండుగ చేసుకున్నారు. హనుమాన్‌పేట ఎస్‌కేసీవీ చిల్డ్రన్స్ హోమ్‌లో చిన్నారులకు రంగులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): హోలీ పండుగను నున్న గ్రామ శివారు సుగాలీ కాలనీలో సుగాలీలు ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకున్నారు. యువకులు, వృద్ధులు, మహిళలు కలిసి రంగులు చల్లుకున్నారు. ఆనందంగా ఉండటమే పండుగ విశేషమని మాజీ ఎంపీటీసీ దుర్గాప్రసాద్‌నాయక్ తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



తాడిగడపలో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ కన్వీనర్ జోగి రమేష్ అన్నారు. తాడిగడప వసంతనగర్ కాలువ కట్టపై సోమవారం మంత్రి జోగి రమేష్ గడప గడపకు వైఎస్సార్ సీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో ఇచ్చిన ప్రతీ ఒక్క హామీని అయన అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేశారన్నారు. నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. గత ఐదేళ్లుగా జగనన్న ప్రజాపాలన అందించారన్నారు. కాలువ కట్టలపై నివశించే ప్రజలు జగనన్న పాలనలో భరోసాగా జీవించాలని హామీ ఇచ్చారు.

కూటమికి గుణపాఠం చెప్పండి..

ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కేవలం అధికారం కోసం పాకులాడుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మంత్రి జోగి రమేష్ కోరారు. గత 2014లో ఇదే కూటమి అధికారం చేపట్టి ప్రజల సమస్యలు విస్మరించి అధికారం కోసం కొట్టుకోని విడిపోయారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలు బాగుండాలంటే కూటమి వలన మేలు జరగదని, కేవలం జగనన్న తిరిగి సీఎం అయితేనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమిని తరిమి కొట్టాలని అన్నారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నేతలు పీజే.కిషోర్, ముజీబ్, ఖాదర్‌బాషా, కాకి శ్రీనివాసరావు, ఎస్.కిషోర్, అర్షద్, ఎల్లారావు, కటికల క్రిష్టోఫర్, కృష్ణమూర్తి, అనగాని గోపీ, వరప్రసాద్, జయకర్, పవిత్ర, జిన్నా, జోస్‌మేరీ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు



అభిషేకం నిర్వహిస్తున్న అడపా సోదరులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామంలోని అడపా దేవులబాబు గురుస్వామి ప్రాంగణంలో అడపా బదర్స్ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తుల 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. గణపతి హోమం, పూర్ణాహుతి, పంచామృతాభిషేకం కనుల పండువగా జరిగాయి. స్వామికి అన్నాభిషేకం నిర్వహించి, భక్తులకు అన్న ప్రసాదం అందించారు. సర్పంచ్ అడపా అంజిబాబు, అడపా యుగంధరరావు పాల్గొన్నారు.

చలసాని కుటుంబానికి న్యాయం జరిగేనా?



దేవినేని స్మిత
(పండు కుమార్తె)

కంకిపాడు: భరోసా ఇచ్చి, పార్టీ కోసం పనిచేయమని చెప్పి తీరా టికెట్ విషయంలో మొండి చెయ్యి చూపడం టీడీపీకి పరిపాటిగా మారిందని ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చలసాని పండు కుటుంబాన్ని నమ్మించి మోసం చేశారని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. పెనమలూరు టిక్కెట్ ఆశించిన నిరాశ చెందిన చలసాని కుటుంబానికి నేటికీ అధిష్టానం నుంచి పిలుపు లేదు. కనీసం చర్చించేందుకు పార్టీ పెద్దలు ఒక్కరూ రాలేదు. ఈ పరిస్థితులపై పండు వర్గం అధిష్టానంపై మండిపడుతోంది. ఆ వర్గానికి చెందిన సామాజిక వర్గాల వారీగా ఆత్మీయ సమావేశాలు నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణకు సమాయత్తమవుతోంది. పెనమలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా పనిచేసిన చలసాని వెంకటేశ్వరరావు(పండు) 2010లో దారుణహత్యకు గురవ్వటంతో పార్టీ అధిష్టానం సీటును ఆ కుటుంబానికే అని ఒప్పందం ఇచ్చి సార్వత్రిక ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ మాట తప్పింది. అదే పరిస్థితి ఈ దఫా కూడా జరిగింది. 2014లో పండు సతీమణి పద్మావతికి సీటు దక్కలేదు. ప్రస్తుతం ఆయన కుమార్తె దేవినేని స్మితకు అవకాశం ఇవ్వలేదు.

భరోసా ఇచ్చి.. నమ్మక ద్రోహం

కరోనా సమయంలో చలసాని ట్రస్ట్ ద్వారా గ్రామాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయటంలో ముఖ్య భూమిక పోషించారు. పార్టీ అధిష్టానం భరోసా ఇవ్వటంతో ఈ దఫా కూడా పార్టీ కోసం చలసాని కుటుంబం, వర్గం పనిచేసింది. టిక్కెట్ కచ్చితంగా వస్తుందని ఆశించారు. కానీ అధిష్టానం ఇచ్చిన మాటను పక్కనపెట్టి, చలసాని కుటుంబాన్ని మళ్లీ మోసం చేసింది. బోడె ప్రసాద్‌కు సీటు లేదని చెప్పి మళ్లీ ఆయనకే సీటు ఇవ్వటానికి పండు వర్గం జీర్ణించుకోలేకపోతుంది. 2014 నుంచి నేటి వరకూ ఒక్క రోజూ చలసాని కుటుంబాన్ని, వర్గాన్ని కలుపుకుని వెళ్లే ప్రయత్నం చేయలేదని, ఆఖరికి పండు వర్ధంతి కార్యక్రమాలు కూడా జరగకుండా అడ్డుకున్నారని బోడె వర్గంపై మండిపడుతున్నారు.

భవిష్యత్తు కార్యాచరణ దిశగా..

తమకు అన్యాయం జరిగిందని చలసాని పండు కుమార్తె దేవినేని స్మిత ఇటీవల మీడియా ముఖంగా తమ ఆవేదన వెలిబుచ్చారు. నమ్మించి నమ్మక ద్రోహం చేశారని కంటతడిపెట్టారు. సీటుపై భరోసా ఇవ్వటంతో నియోజకవర్గంలో పనిచేస్తే అన్యాయం చేశారని వాపోయారు. ఇంత జరిగినా ఆ కుటుంబానికి అధిష్టానం నుంచి పిలుపు రాలేదు. పార్టీ పెద్దలు ఎవరూ కూడా వచ్చి సంప్రదింపులు జరపలేదు. దీంతో రానున్న ఎన్నికల్లో తీసుకోవాల్సిన భవిష్యత్తు నిర్ణయంపై పండు వర్గం సమాలోచనలు చేస్తోంది. బోడెకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించేది లేదని ఆ వర్గం స్పష్టం చేస్తోంది. కార్యకర్తల మనోగతాన్ని బట్టి అడుగులు వేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఏ నిర్ణయం తీసుకుంటారన్నది వేచిచూడాల్సిందే.

దళితుల హక్కులు పరిరక్షించాలి

పెనమలూరు: తమ హక్కులు పరిరక్షించి, న్యాయం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొసనం రాము కోరారు. కానూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం దళిత డిక్లరేషన్‌పై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. రాము మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా తమ హక్కులు పూర్తి స్థాయిలో అమలు జరగలేదన్నారు. ఇకనైనా దళితుల హక్కులపై రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. దళిత బహుజన ఫ్రంట్, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం దళితుల సమస్యలపై అధ్యయనం చేసి డిక్లరేషన్ రూపొందించిందన్నారు. రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు వారి మేనిఫెస్టోలో డిక్లరేషన్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. వివిధ పార్టీల, ప్రజాసంఘాల నేతలు పాల్గొని దళిత డిక్లరేషన్‌కు మద్దతు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో ఘన విజయమే లక్ష్యం

గన్నవరంరూరల్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ఎంపీపీ అనగాని రవి పిలుపునిచ్చారు. వీరపనేనిగూడెం సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటి వద్ద సోమవారం రాత్రి గ్రామ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ఇళ్ల వద్దకే పాలన అందిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికలలో అఖండ విజయం చేకూర్చాలని జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య చెప్పారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నందిపాటి పద్మావతి, మండల పార్టీ అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్, ఉప సర్పంచ్ బండి నాగసాంబిరెడ్డి, సర్పంచ్ తూంపాటి రాంబాబు, బత్తుల లోకేశ్వర్‌రెడ్డి, బండి సాంబిరెడ్డి, నందిపాటి సుబ్బారెడ్డి, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సుబ్బారెడ్డి, సూరెడ్డి మణిమ్మ, గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రంగన్నగూడెం అభివృద్ధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో గ్రామంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు విష ప్రచారానికి తెరలేపారని రంగన్నగూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ కసుకుర్తి స్వరూపారాణి దుయ్యబట్టారు. గత 25 ఏళ్లుగా గ్రామంలో పెత్తనం చెలాయిస్తున్న టీడీపీ నాయకులు హాయంలో జరగని అభివృద్ధి గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో చేశామని ఆమె ఘంటాపథంగా చెప్పారు. దీనిపై టీడీపీ నేతలతో బహిరంగ చర్చకు సైతం సిద్ధమని సవాల్ విసిరారు. 2014–19 మధ్య రూ.5 కోట్లతో అభివృద్ధి చేశామని టీడీపీ నాయకులు అబద్ధాలను చెప్పుకుంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ కసుకుర్తి శ్రీనివాసరావు, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు పొణుకుమాటి కోటయ్య, కరణం శశికళ పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

గన్నవరం: నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు ప్రారంభమయ్యాయి. మండలంలోని మాదలవారిగూడెం గ్రామానికి చెందిన 15 మంది టీడీపీ కార్యకర్తలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో వీరికి వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, మండల పార్టీ అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి సస్పెండ్‌కు గురైన గ్రామ కన్వీనర్ పిన్నిబోయిన తిరుపతిరావును పార్టీ నుంచి సస్పెండ్ చేసి అతని స్థానంలో పిన్నిబోయిన నాగరాజుకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం పార్టీ నాయకులు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం జరగనుందన్నారు. ఈ సంగ్రామంలో నిరుపేదల పక్షాన ఉన్న వైఎస్సార్ సీపీకి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో దశాబ్దన్నర కాలంగా పేదలకు అండగా నిలుస్తున్న వల్లభనేని వంశీమోహన్‌ను మూడో సారి ఎమ్మెల్యేగా గెలపించుకోవాలని కోరారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జలసూత్రం రామ్మోహన్‌రావు, ముస్తాబాద పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మేచినేని బాబు, జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సూరెడ్డి మణిమ్మ, ఎంపీటీసీ పిన్నిబోయిన రాంబాబు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలకు గడువు పొడిగింపు

గన్నవరంరూరల్: ప్రైవేట్ స్కూళ్లల్లో ఉచిత ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఎంఈఓ కొండా రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సచివాలయం, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ స్కూళ్లలో పేద పిల్లలకు ఒకటవ తరగతిలో ఉచిత ప్రవేశాలకు అవకాశం ఉందన్నారు. వివరాలకు 1800 425 8599 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వలంటీర్ వ్యవస్థపై టీడీపీ విషం చిమ్ముతోంది



గన్నవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిస్వార్థంగా ప్రజలకు చేరువ చేస్తున్న వలంటీర్లపై టీడీపీ, జనసేన పార్టీలు విషం చిమ్ముతుండడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య పేర్కొన్నారు. స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ బీసీ సెల్ జలసూత్రం రామ్మోహన్‌రావు, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, పార్టీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ వల్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నారని చెప్పారు. దీనిలో భాగంగానే వలంటీర్లను స్లీపర్ సెల్స్, తీవ్రవాదులుగా శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పోల్చడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. వల్లభనేని అరుణ ట్రస్ట్ ద్వారా వంశీమోహన్ గత 17 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలకు సేవలందించారని చెప్పారు. గత పదేళ్లుగా వంశీమోహన్ తన సొంత ఖర్చుతో 350 మోటర్లను ఏర్పాటు చేసి రైతులకు సాగునీరు అందిస్తున్నారన్నారు. పంటలు ఎండిపోకుండా మోటర్లు ఏర్పాటు చేయడంపై టీడీపీ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. తమ స్వార్థ రాజకీయాల కోసం రైతులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని టీడీపీ నేతలకు హితవు పలికారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పార్టీ నాయకులు కైలే శివకుమార్, మేచినేని బాబు, సూరెడ్డి మణిమ్మ పాల్గొన్నారు.

రంగన్నగూడెం పంచాయతీ కార్యదర్శి బదిలీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆల కళ్యాణిపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ పి.రాజాబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత రంగన్నగూడెం పంచాయతీ పరిధిలోని సింగన్నగూడెం గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారని టీడీపీకి చెందిన సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు చర్యలు చేపట్టారు. రంగన్నగూడెం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కళ్యాణిని గన్నవరం సచివాలయం-3కి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవ్వటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్.నాగమణి యనమలకుదురు ఇందిరానగర్‌లో నివాసం ఉంటోంది. రామలింగేశ్వరనగర్‌లో ఆమె కుమార్తె టైలరింగ్ షాపు నిర్వహిస్తోంది. కాగా నాగమణి కుమార్తె షాపు వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి రావటానికి రాపిడో బైక్ బుక్ చేసింది. ఆమె బైక్‌పై బయలుదేరింది. బైక్ నడుపుతున్న వ్యక్తి యనమలకుదురు వంతెన వద్దకు వచ్చిన తరువాత ఎదురుగా వచ్చిన ఆటోను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఆమె బైక్‌పై నుంచి పడిపోవటంతో తలకు గాయమైంది. పటమట ఆస్పత్రిలో ఆమెను చికిత్సకు చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్

కంకిపాడు: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని కంకిపాడు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గొడవర్రు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న కాగిత సత్యనారాయణ వద్ద తనిఖీ చేయగా ఎనిమిది మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సత్యనారాయణపై కేసు నమోదు చేశారు. బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సందీప్ హెచ్చరించారు.

కూరగాయల లారీ బోల్తా



ఉయ్యూరు: జాతీయ రహదారిపై కూరగాయల లోడు లారీ బోల్తా పడింది. లారీ టైరు పగలటంతో గండిగుంట వద్ద సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. విజయవాడ నుంచి ఉయ్యూరు కూరగాయల మార్కెట్‌కు కూరగాయల లోడుతో వస్తున్న లారీ గండిగుంట వద్దకు చేరుకునే క్రమంలో టైరు పగలటంతో బోల్తాపడింది. దీంతో లారీ విజయవాడ నుంచి ఉయ్యూరు వైపు వస్తూ డివైడరు ఎక్కి విజయవాడ వైపు వెళ్లే మార్గంలో బోల్తా పడింది. కూరగాయలు అన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. లారీ డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. పల్టీ కొట్టే సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండటంతో పెనుప్రమాదం తప్పింది.